రణరంగంగా మారిన గాంధీభవన్

- మంత్రుల సమక్షంలోనే నేతల బాహాబాహీ



# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం


BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 28 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8




## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మే 27: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు మిగతా 3లో..

## అకాల వర్షాలకు కల్లాల్లో తడిసిన ధాన్యం

- వర్షంతో చల్లబడ్డ వాతావరణం
- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్







హైదరాబాద్, మే 27: భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగిం చినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబానగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన మిగతా 3లో..

## సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

- హరీష్‌రావు ఆరోపణల నుంచి దృష్టి మరల్చే యత్నం
- తనపై నిందలు మోపి మళ్లీ జైలుకు పంపే కుట్రలు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ

2లో..

## మాజీ సీఎం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత

- ఇడి అధికారుల కారుపై రాళ్లదాడి
- దాడిలో ధ్వంసం అయిన కారు అద్దాలు
- అధికారులకు తృటిలో తప్పిన ప్రమాదం

2లో..

## రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

- పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు

2లో..



## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్



హైదరాబాద్, మే 27: వాతావరణశాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం మిగతా 3లో..

## డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

- ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్



హైదరాబాద్,మే27 : బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధుల్లో రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీతెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులుఒక వ్యాపారితో బేరమాడి, రూ.5 వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువులతో ఉడాయించారని తెలిపారు. అదే విధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు వ్యక్తులు రూ.48 వేల విలువైన మేకలను కొనుగోలు చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టిం చార న్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమత్తంగాఉండాలని సూచించారు. పశువులను అప్పగించే ముందు, మీ బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకో వాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయ త్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

- పంటల కొనుగోలు లేక దీనావస్థ
- వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి
- బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు



హైదరాబాద్,మే27 : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు మిగతా 3లో..

## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

- సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌కు తరలింపు



హైదరాబాద్,మే27 : పోక్స్ కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం అతడిని మొయినా బాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం భగీరథ్‌ను పోలీసులు ఈ ఫామ్ హౌస్‌కు తీసుకెళ్లినట్ల తెలుస్తోంది. మరోవైపు భగీరథ్‌ను మూడు రోజులపాటు ప్రశ్నించేందుకు పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. అతడిని కస్టడీకి కోరుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. బండి భగీరథ్‌ను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీంతో బండి భగీరథ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అతడిని మూడు రోజుల పాటు పోలీసులు విచారించనున్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. ఆమెపై అత్యాచారం చేశాడనే ఆరోపణలు బండి భగీరథపై వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మే 16వ తేదీన అతడిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. బండి భగీరథ్ నుంచి మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని.. వారం రోజుల పాటు అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులు స్పష్టం చేశారు. కానీ కోర్టు మాత్రం భగీరథ్‌ను మూడు రోజుల వరకే పోలీసుల కస్టడీకి అనుమతి ఇచ్చింది.

## ప్రధానితో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

- రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి
- పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం





న్యూఢిల్లీ,మే27 : తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది.

## కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

- సిద్ధరామయ్యను తప్పుకోవాలని అధిష్టానం సూచన
- నేడు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం
- 30న డికె శివకుమార్ ప్రమాణం చేస్తారన్న ప్రచారం
- సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపాలని అధిష్టానం నిర్ణయం

న్యూఢిల్లీ,మే27 : కర్నాటకం క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు మిగతాలు 3లో..

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు



- **ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడి**

**హైదరాబాద్, మే 27:** తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మోస్తరు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఆ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. జనగామ, మహబూబ్‌నగర్, మేడ్చల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు, మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని నెలలుగా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. మరోవైపు అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.


# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

- **వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు**



**కాళేశ్వరం,మే27 :** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్ఛరణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభం అయిన పుష్కరాల్లో భక్తులు వివిధ ప్రాంతాల న ఉంచి వచ్చి నదీ స్నానం ఆరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్య స్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి హాజరై పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గురిం చి వివరించారు. అలాగే దేవాదాయ కమిషనర్ హనుమంతరావు హాజరై పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్త్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపో యిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడు కోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. అలాగే అంత్య పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోశ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేప థ్యంలో ఆ పూజలను తాత్కలికంగా నిలిపివేశారు. పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతి రోజూ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వ హించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ కల్యా ణోత్సవంలో పాల్గొని పునీతులవుతారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కల్యాణాన్ని నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్నారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత



- **అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచన**

**న్యూఢిల్లీ,మే27 :** దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్‌కు గురికాకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత ఉన్న సమయాల్లో అవసరం లేకుండా బయట తిరగకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించాలని, ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఇతరులకు తాగునీరు అందించే వారిని అభినందిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

# రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది



- **ధాన్యం సేకరణలో ఎప్పుడూ లేనంత నిర్లక్ష్యం**
- **మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు**

**వనపర్తి,మే27 :** రైతులకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకు పోవడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలసి జిల్లాలోని పెద్దమందడి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడం రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రైతులకు ఉద్దేశపూర్వకంగానే సకాలంలో యూరియా ఇవ్వకుండా, కరెంట్ సరఫరాలో కోతలు పెడుతూ, కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు విసిగిపోయి తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే, ప్రభుత్వంపై భారం పడకుండా ఉంటుందని రేవంత్ కుట్ర చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. నాడు కేసీఆర్ పంట చేతికి రాగానే వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. నేడు రేవంత్ తుగ్లక్ పాలనలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని దుయ్యబట్టారు.

# రణరంగంగా మారిన గాంధీభవన్

## మంత్రుల సమక్షంలోనే నేతల బాహాబాహీ

**హైదరాబాద్, మే27 :** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, విహెచ్, ఎమ్మెల్సీలు బల్మూరి, అద్దంకి దయాకర్‌ల సమక్షంలోనే నేతలు ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హాజీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హాజీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ సర్ ప్రక్రియపై చర్చించేందుకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు వేదికైంది. పార్టీ సీనియర్ నేత, మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పక్కన కూర్చొనే విషయంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్ చార్జ్ ఉస్మాన్ అల్ హాజీల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. మొదట ఇద్దరి మధ్య మాటల యుద్ధంతో ప్రారంభమైన ఈ గొడవ కాస్తా శృతిమించి ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఆగ్రహంతో ఉస్మాన్.. ఫిరోజ్‌ఖాన్‌ను గట్టిగా తోసేయడంతో ఆయన ఒక్కసారిగా కిందపడిపోయారు. గాంధీభవన్ లో సీనియర్ నేతల సమక్షంలోనే ఈ రసాభాస జరగడంతో అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. ఈ గొడవ మరింత పెద్దది కాకుండా ఉండేందుకు అక్కడే ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, ఆవేశంలో ఉన్న నేతలు వీహెచ్‌ను కూడా పక్కకు తోసేసేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. వెంటనే అప్రమత్తమైన మిగతా కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలో దూరి ఇరువర్గాలను విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి : వేముల

**నిజామాబాద్,మే27 :** అకాల వర్షంతో తడిసిన ధాన్యం కొనగడంతో పాటు, నష్టపోయిన రైతలను ఆదుకోవాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్ చేశారు. సకాలంలో పంటలు కొనుగోలు చేసివుంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. అలవికాని హామీలు ఇచ్చి గద్దదెనెక్కిన కాంగ్రెస్ వాటి అమలులో పూర్తిగా విఫలమైంది. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి రగులుతున్నది. బీఆర్ఎస్‌కు రోజురోజుకూ ప్రజా మద్దతు పెరుగుతున్న దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్సే గెలుస్తుందని, మళ్లీ కేసీఆ ర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రైతుబంధు పేరుతో కేసీఆర్ ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి సాయం అందిస్తే, రూ.12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్ పది వేలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని విమర్శించారు.

# రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

## పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు

**హైదరాబాద్, మే27 :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్టిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వా నికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్‌ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్‌ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్‌ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్‌ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ము లుగు డీఆర్‌ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీం నగర్ డీఆర్‌ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ.పాండును కామారెడ్డి డీఆర్‌ఓగా బదిలీ చేశారు.వీరితోపాటు జనగామతహశీల్దార్‌సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియ మించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్డీసీగా , ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్‌ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# మాజీ సీఎం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత



- **ఇడి అధికారుల కారుపై రాళ్లదాడి**
- **దాడిలో ధ్వంసం అయిన కారు అద్దాలు**
- **అధికారులకు తృటిలో తప్పిన ప్రమాదం**

**తివనంతపురం,మే27 :** కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఆయన నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకించిన పినరయి మద్దతుదారులు.. ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. వారి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు, కేంద్ర బలగాలు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి సమయంలో వాహనంలో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆందోళనకారులను సీపీఎం కార్యకర్తలుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. ఆందోళనకారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువనంతపురంలోని థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే కేరళం మాజీ సీఎం పినరయి విజయ్ నివాసంలో ఈడి రెయిడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఆయన మద్దతుదారులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బుధవారం తిరువనంతపురంలో సోదాల అనంతరం తిరిగి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు రాళ్లతో వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈడీ రాక నేపథ్యంలో పినరయి విజయన్ నివాసానికి ఆయన మద్దతుదారులు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈడీ అధికారుల వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలని ఈడి దాడులు నిర్వహిస్తోందని సీపీఎం నేతలు ఆరోపించారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళంలోని 10 ప్రాంగణాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది. తిరువనంతపురంలోని మాజీ సీఎం విజయన్ ప్రస్తుత నివాసంతో పాటు ఆయన స్వస్థలమైన కన్నూర్‌లోని మరో ప్రాంగణం, మాజీ సీఎం విజయన్ అల్లుడు, మాజీ మంత్రి మొహమ్మద్ రియాజ్‌కు చెందిన నివాసంలో (కోజికోడ్) కూడా ఈడీ రెయిడ్స్ నిర్వహించింది. సోదాల సమయంలో మాజీ సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండగా బయట మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు దాడికి దిగే ప్రయత్నం చేయడంతో పార్టీ సీనియర్ నేతలు వారిని అడ్డుకుని శాంతింపజేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాజీ సీఎం విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే సీఎంఆర్ఎల్ డబ్బులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ రెయిడ్స్ నిర్వహించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కూడా రంగంలోకి దిగింది. మొత్తం రూ.2.7 కోట్లు సీఎంఆర్ఎల్ నుంచి ఎక్సాలాజిక్‌కు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐటీ సర్వీసులు, కన్సల్టెన్సీ సేవల మాటున ఈ చెల్లింపులు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈడీ కేసును కొట్టేయాలంటూ సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవలే తోసిపుచ్చింది. మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ సీఎం విజయన్ గతంలోనే కొట్టిపారేశారు. తమ ఇమేజీని దెబ్బతీసే లక్ష్యంగా ఈ ఆరోపణలు పుట్టుకొచ్చాయని చెప్పారు.

# సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

- **హరీష్ రావు ఆరోపణల నుంచి దృష్టి మరల్చే యత్నం**
- **తనపై నిందలు మోపి మళ్లీ జైలుకు పంపే కుట్రలు**
- **మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ**



**హైదరాబాద్, మే 27:** సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం పై హరీష్ రావు సంచలన ఆరోపణల నుంచి దృష్టిని మరల్చడానికే మంత్రులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు.సింగరేణిని సీఎం బామ్మర్దికి అప్పగించారని ఆరోపించారు. తనపై తెలంగాణ ఉద్యమంలో 226 కేసులు ఉన్నాయని, సీసీఎస్ డార్క్ సెల్‌తో సహా హైదరాబాద్ నగరంలో అన్ని పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని వెల్లడించారు.సింగరేణి కార్మికులు, ప్రజల ఓట్లతో రెండు సార్లు గెలిచాను.ప్రజల దృష్టిని మరల్చడానికి తన వ్యాఖ్యలను చీప్ ట్రిక్ కింద వాడారని విమర్శించారు. సీఎం కార్యాలయం డైరెక్షన్ మేరకు తనను ట్రోల్ చేస్తున్నారని వివరించారు. మరోసారి తనపై కేసు పెట్టి జైలుకు పంపుతారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఇబ్బందులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీని కాలుస్తా అన్న జడ్చర్ల ఎమ్మెల్యేపై, నరుకుతా అన్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాగూర్‌పై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నాడు ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చాలని పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఏ వర్గం సంతృప్తిగా లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తనను టార్గెట్ చేసింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి టార్గెట్ చేస్తోందని ఆరోపిం చారు. శ్రీలంకలో, బంగ్లాదేశ్ లో ప్రజలు తిరగబడు నట్లు తెలంగాణలోను ప్రజల తిరుగుబాటు వస్తుందని వెల్లడించారు. సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించే లోగా రైతుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,ప్లలె రవికుమార్ , కురువ విజయ్ కుమార్ , తుంగ బాలు , పడాల సతీష్ రాజేష్ ,రవీందర్ రెడ్డి ,హరిబాబు పాల్గొన్నారు.

# నగరంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

- **ఏకకాలంలో 8మంది అధికారుల బృదం తనిఖీలు**




**హైదరాబాద్, మే27 :** హైదరాబాద్ నగరంలోని పలు ఆర్టీవో కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మేడ్చల్ ఆర్టీవో కార్యాలయం, నాగోల్ ఆర్టీవో కార్యాలయాలతో పాటు కొండాపూర్ ఆర్టీవో కార్యాలయంలో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. సుమారు 8 మంది అధికారులతో కూడిన బృందాలు ఏకకాలంలో కార్యాలయాలను తనిఖీ చేస్తున్నాయి. ఆర్టీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. పెండింగ్ వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియపై అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే ఆర్టీఏ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను కూడా విచారిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర రిజిస్ట్రేషన్ పనులు అక్రమంగా జరుగుతున్నాయనే సమాచారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# (మొదటిపేజీ తరువాయి)

## అకాల వర్షాలకు కల్లాల్లో తడిసిన ధాన్యం

వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యానం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ÷ూఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రధానితో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జనపథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. కాగా, ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్తారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగే బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. కర్ణాటకలో నాయకత్వ మార్పిడి సజావుగా పూర్తి చేసేందుకు కేంద్ర నాయకత్వం గట్టి కసరత్తే చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం సిద్ధరామయ్య సేవలను కేంద్ర స్థాయిలో ఉపయోగించు కునేందుకు వీలుగా ఆయనను రాజ్యసభకు పంపాలని పట్టుదలగా ఉంది. అయితే ఆలోచించుకునేందుకు తనకు కొంత సమయం ఇవ్వాలని సిద్ధరామయ్య కోరినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించాలని కేంద్ర నాయకత్వం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడంతో సిద్ధరామయ్య ఎప్పుడు రాజీనామా చేస్తారు? డీకే ఎప్పటిలోగా ప్రమాణస్వీకారం చేస్తారనే అంశాలు ఆసక్తిరకంగా మారాయి. ఇందులో రెండు ఆప్షన్లు ఉన్నట్టు చెబుతున్నారు. ఒక ఆప్షన్ ప్రకారం ఈనెల 28న కానీ 29న కానీ సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఈవారం చివర్లో 30వ తేదీ డీకే కొత్త సీఎంగా ప్రమాణస్వీకారం చేయవచ్చు. రెండో ఆప్షన్ ప్రకారం సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకునే విషయంలో జాప్యం తలెత్తవచ్చు. అదే జరిగితే జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు జరిగిన తర్వాతే సిద్ధరామయ్య రాజీనామా చేయడం, డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టడం జరుగుతుంది.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

- మహిళాభివృద్ధిలో ఇదో చారిత్రాత్మక నిర్ణయం
- ఉండి మహానాడులో రఘురామ ప్రకటన



భీమవరం,మే27 : మహానాడు వేడుక వేదికగా రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇస్తామని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటించటం చరిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. దీంతో దేశంలో అందరికన్నా ముందుగా మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే పార్టీగా ఈ నిర్ణయంతో టీడీపీ గుర్తించబడిందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించిన నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు అద్భుతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో నిర్వహించిన మహానాడులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. రఘురామకు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు అంటూ జడ శ్రవణ్ కుమార్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అతడు ఎన్ని అబద్దాలు ఆడాడో సుప్రీంకోర్టులో రికార్డ్ చేయడం జరిగిందని.. వాటిని చూపిస్తానని చెప్పారు. వాటిని చూసి అతడికి విజ్ఞులైన ప్రజలు బుద్ధి చెప్పాలని సూచించారు. ఆకివీడులో ఆలయ నిర్మాణానికి ఒక్కరోజు కూడా ఆలస్యం జరగదని ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు మనకు అనుకూలంగా వస్తుందన్నారు. అందులో ఎటువంటి సందేహము లేదని చెప్పారు. నుకున్న సమయానికి రామాలయాన్ని పూర్తి చేస్తామని శ్రీరామభక్తులకు తెలియజేస్తున్నానన్నారు. తెలుగువీర లేవరా అనే ఫోరంను స్థాపించామని వివరించారు. దీనికి చాలా చక్కటి స్పందన వస్తుందన్నారు. అలాగే తెలుగువీర లేవరా వెబ్‌సైట్ కూడా ఒకటి రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఓట్ల రాజకీయం కోసం మనకెందుకులే అని వదిలేస్తున్న అంశాలను తీసుకుని న్యాయం చేయడమే ఈ తెలుగు వీర లేవరా ఫారం ముఖ్య ఉద్దేశమని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ వివరించారు. తాను ప్రాతినిధ్యం వహించే ఉండి నియోజకవర్గంలో అన్ని ప్రార్థన మందిరాలలో లౌడ్ స్పీకర్లు సమూలంగా నిర్మూలించామని చెప్పారు. ప్రజలకు లౌడ్ స్పీకర్ల వల్ల ఇబ్బంది ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు స్పష్టం చేశారు.

## కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తప్పవు

- తప్పుదోవ పట్టించేలా ఎపి పేపర్ మిల్లు సమాచారం
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



రాజమండ్రి,మే27 : గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిలో కాలుష్యాన్ని నివారించేందుకు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పరిశ్రమలు ఇక్కడి వనరులను ఉపయోగించుకుని లాభాలు పొందుతున్నాయని, కానీ కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఏపీ పేపర్ మిల్ యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిందని మంత్రి తెలిపారు. పరిశ్రమ నుంచి విడుదలైన రసాయనాల్లో పీహెచ్ స్థాయి 7 శాతం నమోదైనట్లు చెప్పారు. కలుషిత వ్యర్థాలను గోదావరిలో కలుపుతు న్నారని, పరిశ్రమ యాజమాన్యం బాధ్యతారా హిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరిశ్రమల నుంచి మురుగునీరు నేరుగా బయటకు వస్తే యజమానులను జైలుకు పంపిస్తామని, గోదావరిలో వ్యర్థాలు కలిపితే ఆ పరిశ్రమలకు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. గోదావరి పుష్క రాల కోసం రూ.8,500 కోట్ల బడ్జెట్‌తో ప్రతిపా దనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. యాత్రికుల కోసం టెంట్ సిటీలు, హోం స్టేలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే నంది నాటకోత్స వాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పా రు. ఏపీ పేపర్ మిల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుం టామని, ఆ సంస్థకు రూ.13 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

## కడప జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

- కడప-రాయచోటి రహదారిపై రాకపోకలకు అంతరాయం

కడప,మే27 : కడప జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడింది. ఈ ప్రమాదం కారణంగా రాయచోటి - కడప ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గువ్వల చెరువు ఘాట్‌లోని ఐదో మలుపు వద్ద ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో రాయచోటి కడప మార్గంలో వాహనాల రాకపోకలను పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్‌ను మళ్లించారు. రాయచోటి నుంచి వెళ్లే వాహనాలను చక్రాయపేట మార్గం మీదుగా దారి మళ్లిస్తున్నారు. ఘటనాస్థలిలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోల్తాపడిన గ్యాస్ ట్యాంకర్‌ను తొలగించేందుకు ఉదయం నుంచే సహాయక చర్యలు కొనసాగాయి. మూడు భారీ క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను పైకి లేపే ప్రయత్నాలు చేశారు. అయితే ఈ ప్రక్రియలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. ట్యాంకర్‌ను పైకి లేపే సమయంలో మూడు క్రేన్లు కూడా ఒక్కసారిగా నేలకొరిగాయి. దీంతో సహాయక సిబ్బంది మరింత అప్రమత్తమయ్యారు. ఇదిలా ఉండగా, ట్యాంకర్ నుంచి ఎల్‌పీజీ గ్యాస్ లీక్ అవుతుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గ్యాస్ లీకేజీ కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఎలాంటి అగ్నిప్రమాదం జరగకుండా అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఘటనాస్థలికి అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బలగాలు చేరుకుని పరిసర ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు. ఈ ఘటనతో రాయచోటి ? కడప రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించాలని అధికారులు సూచిస్తున్నారు. గ్యాస్ లీకేజీ పూర్తిగా నియంత్రణలోకి వచ్చిన తర్వాతే ట్యాంకర్ తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

- జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు
- మోడీ నాయకత్వంలో ఆర్థికంగా బలపడ్డ భారత్
- జగన్ జనంలో లేకపోవడమే పెద్ద శాపం
- మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ,మే27 : ప్రధాని నరేంద్ర మోదీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు. జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇకపోతే జనంలో లేకపోవడమే జగన్‌కున్న అసలు సమస్య అని, ఏపీ వ్యాప్తంగా నిరసనలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునివ్వడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు జగన్ ఈ నిరసనలు ఎందుకు చేస్తున్నారో ఆయనకైనా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి హామీలనూ అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నారని, అలా మాట్లాడే ముందు ఆయన క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు.

## టిడిపి మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన

### మహానాడులో పాల్గొన్న ఆరు లక్షల మంది

అమరావతి,మే27 : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు. రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## మహిళలకు టిడిపి పెద్దపీట

### పార్టీ పరంగా 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం

### తీర్మానం ప్రతిపాదించిన వర్కింగ్ ప్రసిడెంట్ లోకేశ్

అమరావతి,మే27 : మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

## దేశంలో 25శాతం పెట్టుబడులు ఎపికే

### రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేస్తాం

### విశాఖ మహానాడు వేదికలో ఎంపి శ్రీభరత్

విశాఖపట్నం,మే27 : దేశంలో గత ఏడాది వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వచ్చాయని విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్ వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ నినాదంతో సక్సెస్ అయ్యామన్నారు. బుధవారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని 42, 43వ వార్డుల క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. 20, 25 ఏళ్ల లోపు యువతకు పబ్లిక్ పాలసీ, రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళా బిల్లు చట్టం అమలులోకి రావడం ఖాయమన్నారు. పార్టీలోకి పెద్ద ఎత్తున మహిళా శ్రేణులను తెలుగుదేశం పార్టీ ఆహ్వానిస్తోందని తెలిపారు. టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించటం శుభసూచకమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్లనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 82 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో మహానాడు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసం ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా1,850 క్లస్టర్లలో మహానాడు సమావేశాల నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలోని 81 క్లస్టర్లలో వర్చువల్‌గా నిర్వహించిన మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటిగుంతలో పడి ముగ్గురు బాలల మృతి

పెనుకొండ, మే27 : శ్రీసత్యసాయి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నీటి గుంతలో పడి ముగ్గురు బాలురు మృతిచెందారు. రొద్దం మండలం నారనాగేపల్లిలో ఈ ఘటన జరిగింది. పొలంలో నల్లనేరేడు పండ్ల కోసం వెళ్లి నీటి గుంతలో పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. బాలుర మృతితో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

బలగం TV BALAGAM balagamtv100@gmail.com

## సంపాదకీయం

# అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాల్సిందే !

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు సావాల్‌గా మారింది. అలాగే దేశంలో అలజడులకు కారణమవుతోంది. పెరుగుతున్న జనాభాకు తోడు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారి కారణంగా పలు రాష్ట్రాలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నాయి. దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. ఓటర్లుగా ఉన్న విదేశీయులను మొన్నటి ఎన్నికలకు ముందు సర్ ప్రక్రియలో లక్షల్లో తొలగించారు. దీనిపై నాటి సిఎం మమతా బెనర్జీ నానాయాగీ చేశారు. అసలు ఎంతమంది ఉన్నారన్నదానికి లెక్కాపత్రం లేనంతగా ఇక్కడ అక్రమ వలసదారులు చేరిపోయారు. అమెరికాలో ట్రంప్ వచ్చాక నిర్దాక్షిణ్యంగా అక్రమ వలసదారులను తన్‌ఇన తరిమేశారు. ప్రపంచ దేశాలు నిరసనలు వ్యక్తం చేసినా ట్రంప్ పట్టించుకోలేదు. ఇది ఓ హెచ్చరికగా అన చర్యలు నిలిచాయి. ఇప్పుడు భారత్ కూడా అలాంటి చర్యలను కఠినంగానే తీసుకోక తప్పదు. ఈ క్రమంలో బెంగాల్లో అక్రమవలసదారులపై ప్రభుత్వం కొరడా ఝళిపించింది. ఇకపోతే అక్రమ వలసతకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వా నికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా మారడం తో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు. ఇదిలా వుంటే బెంగాల్లో అక్రంగా తిష్టవేసిన వారు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరారు. మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది, స్థానికులనే సవాల్ చేసే స్థాయికి చేరారు. ఈ క్రమంలో కొత్తగా అధికారం చేపట్టిన సువేందు అధికారి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ వసలదారులను తరిమేసే పనులు చేపట్టింది. కొంచెం కఠినంగానే హెచ్చరించింది. తన్ని తరిమేసే వరకు ఆగకుండా పారిపోవాలని హెచ్చరించింది. ఈ క్రమంలో సరిహద్దులకు బంగ్లా అక్రమచొరబాటుదార్లు చేరుకుంటున్న దృశ్యాలు చూస్తున్నాం. దీనిని బట్టి ఎంతగా ఇక్కడ తిష్టవేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బెంగాల్లో కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు ఇప్పుడు అక్కడ అక్రమవసలదారుల గుండెల్లో దడపుట్టిస్తోంది. తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొనేలోపే రాష్ట్రం విడిచి పారిపోవాలని చొరబాటుదారులను సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలి? వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలి? ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా?' అని సువేందు ప్రశ్నించారు. గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి నినాదంతో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను వెనక్కి పంపడానికి బెంగాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నా యి. ఈ క్రమంలో అక్రమ వలసదారులపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి.. చట్ట విరుద్ధంగా ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాల ను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు నుంచి విడుదలై.. తమ తమ దేశాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర హోం శాఖ లేఖలు రాసింది. మొత్తంగా బెంగాల్లో ఏరివేత కారణంగా బీహార్, అసోం తదితర రాష్ట్రాల్లో వారు షెల్టర్ పొందకుండా చూడాలి. అక్కడి ప్రభుత్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలి. అలాగే హైదరాబాద్‌లో తిష్టవేసిన రోహిగ్యాలను కూడా పట్టుకని పంపించాలి.

# కొచ్చిన్ మినరల్స్ లిమిటెడ్ కేసు




## మాజీ సీఎం పినరయ్ నివాసాలపై ఇడి దాడులు

తిరువనంతపురం,మే27 : కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు దిగింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో భాగంగా సోదాలు చేపట్టింది. మాజీ సీఎం నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. రూ.1.72 కోట్ల ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీ 2018-2019 మధ్యకాలంలో మాజీ సీఎం విజయన్ కుమార్తె టి.వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి ఎలాంటి సేవలు అందించలేదు. అయినప్పటికీ సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి రూ.1.72 కోట్లు అక్రమంగా చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, 2024లో ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మంగళవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఈడీ అధికారులు తిరువనంతపురం లోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసం, కోజికోడ్‌లోని మాజీ పర్యాటక శాఖ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ నివాసంతో సహా పలుచోట్ల ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో పెద్ద సంఖ్యలో అధికారులతో, కట్టుదిట్టమైన గోప్యత మధ్య ఈ సోదాలు మొదలయ్యాయి.

# ఇడి దాడులపై భగ్గుమన్న సిపిఎం

- కేరళలో పలు చోట్ల ఆందోళనలు
- బిజెపితో కాంగ్రెస్ చేతులు కలిపిందన్న నేతలు





తిరువనంతపురం,మే27 : కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళం శాసనసభ ప్రతిపక్ష నాయకుడైన పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను సిపిఎం ఖండించింది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను నిరంతరం ఉపయోగించడంలో ఇది ఒక భాగమని సిపిఎం అభివర్ణించింది. సిపిఎం, ఇతర ప్రతిపక్ష శక్తులపై జరుగుతున్న విస్తృత రాజకీయ వేధింపులు, వ్యక్తిత్వ హననంలో ఈ దాడులు ఒక భాగమని సిపిఎం పేర్కొంది. ఈ చర్య కేరళ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడిని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఖండించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో 'ఇలాంటి చర్యలు పినరయి విజయన్‌ను గానీ, సిపిఎంను గానీ భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో యూడీఎఫ్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ÷ఖనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ జరిపిన దాడిని రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి, లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను పద్ధతి ప్రకారం దుర్వినియోగం చేయడానికి ఇది మరో ఉదాహరణ. ఇటువంటి కక్షపూరిత చర్యలు నిరంకుశ మనస్తత్వాన్ని బయటపెడతాయి. ఈ అప్రజాస్వామిక ఎత్తుగడలకు పినరయి, సిపిఎం బెదరబోవు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల మద్దతుతో సిపిఎం దృఢంగా పోరాడుతుంది. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో చేసినట్లే, ఆయనను లక్ష్యంగా చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ఈడీని చురుకుగా ప్రోత్సహించిందన్నది స్పష్టం' అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను ఉపయోగించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలిపిందని సిపిఎం పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాన్ని కేరళ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఈ చర్యను ప్రతిఘటించాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, కేరళ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి, ప్రజాస్వామ్య నిరసనలు, సామూహిక కార్యాచరణ ద్వారా ఈ రాజకీయ దాడులను ఎదుర్కొం టామని సిపిఎం పేర్కొంది. ఈడీ నిర్వహిస్తున్న సోదాలకు వ్యతిరేకంగా కేరళతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆగ్రహిస్తూ పార్టీ శ్రేణులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు. కన్నూర్‌లోని పినరయి విజయన్ కుటుంబ నివాసం, తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న ఆయన అ÷-దదె ఇంటి ముందు సిపిఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టారు. తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలో సిపిఎం కేరళం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిదన్, వి.శివన్‌కుట్టి, జాన్ బ్రిట్టాస్, వి. జాయ్, అనవూర్ నాగప్పన్, వి.కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కన్నూర్‌లో జరిగిన నిరసనలో ఎం.వి. జయరాజన్, పి. జయరాజన్, కె.కె. రాజేష్, కె.కె. శైలజ తదితరులు పాల్గొన్నారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ మాట్లాడుతూ? ఈడీ సోదాలు పార్టీపై, పినరయి విజయన్‌పై జరిగిన 'హేయమైన రాజకీయ దాడి'గా పేర్కొన్నారు. ఈ చర్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ మాట్లాడుతూ, పినరయి విజయన్‌కు ఎక్సాలాజిక్ వ్యవహారంతో ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టులు ఇప్పటికే పేర్కొన్నప్పటికీ, రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# సంస్కరణలకు, విజన్‌పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది

- టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే

పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం

- దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి
- మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం

45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం

- మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత
- ఈ మహానాడు మహిళలకు అంకితం ఇస్తున్నాం
- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు
- మహానాడు మోడల్ మారింది తప్ప..విధానం మారలే
- వైసిపి హయాంలో అణచివేతలను ఎదుర్కొని నిలబడ్డాం
- మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు




అమరావతి, మే 27 : విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్ కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయా ల్లో కీలకంగా వ్యవహరించిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు. కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళల వంటింటి కష్టాలు తగ్గేందుకు నాడు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చాం. నేడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తు న్నాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవ మిస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించాం. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నాం. సోషల్ సైకోల తాటతీసి. మహిళల గౌరవాన్ని కాపాడుతాం. నాడు ఒక్క ఐటీనే.. యువత తల రాత మార్చిoది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయి. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఎంవోయూ లన్నీ పూర్తయితే ఇది సాధ్యమే. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాం. ఇప్పుడు గేర్ మార్చాం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజి నెస్‌పై మాట్లాడుతున్నాం. ఏ ప్రాజెక్టు వచ్చినా మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. 288 ప్రాజెక్టులు ప్రారంభించే రోజు కూడా నిర్ణయించేశాం అని సీఎం తెలిపారు. వర్చు వల్ మహానాడు కారణంగా వాహానాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నా మని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచిందని అంటూ వివరించారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసేనా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫిల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

### పార్టీ జెండా అవిష్కరించిన సిఎం చంద్రబాబు

### పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

### హాజరైన పార్టీ ప్రముఖులు, పొలిట్ బ్యూరో సభ్యులు




తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷ులినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలవురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# కొనుగోళ్ళు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,గంభీరావుపేట:**
తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.బుధవారం గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు.

ఇప్పటివరకు ఈ కేంద్రంలో ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ ఆరా తీయగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, తూకం వేసిన బస్తాలను మిల్లుకు వాహనాల ద్వారా తరలిస్తున్నామని కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

తూకం వేసిన బస్తాలను జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల నుండి తరలించాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగానే టార్పాలిన్లు సరిపడా అందుబాటులో పెట్టుకోవడం ద్వారా వర్షాలకు ధాన్యం తడవకుండా ఉంటుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు తరలించిన అనంతరం మిల్లులో అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. సన్న రకాల సాగుపై దృష్టి సారించాలని రైతులను కోరారు.ఈ తనిఖీలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, తదితరులు ఉన్నారు.



# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**బలగం టీవీ, వేములవాడ :**
ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.బుధవారం వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ద్వారా మంజూరు అయిన 46 లక్షలతో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలగా ఎదురు చూస్తున్న పెద్దమ్మ గుడి నిర్మాణానికి అంకురార్పణ జరగడం శుభపరిణామం అన్నారు.. వేములవాడ నియోజకవర్గ పరిధిలో సుమారు 9 దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం టెండర్లు పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరగా దేవాలయ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు, సంబంధించిన కాంట్రాక్టర్కు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేశారు.. గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం జరిగిందని మళ్లీ నేడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో దేవాలయాల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఒకే గ్రామానికి ఒకేసారి మూడు దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని,పనిచేయాలని తపన ఉన్నవారికి దేవుడు ఒక మార్గాన్ని చూపిస్తారని అన్నారు .

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ ధర్మ రక్షణకు పాటు పడుతున్నారని, అందులో బాగంగా రాష్ట్రంలోని వేములవాడ రాజన్న ఆలయ, సమ్మక్క సారక్క, బాసర, భద్రాచలం ఆలయ అభివృద్ధి కోసం, గోదావరి పుష్కరాల కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందనీ అన్నారు .పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

# స్వయం ఉపాధిపై మహిళలు దృష్టి సారించాలి..





**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**బలగం టీవీ, గంభీరావుపేట :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహిళా సంఘాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా, బుధవారం గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావు కాలనీలో నూతనంగా నిర్మించిన 'ఇందిరా మహిళా శక్తి' భవనాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు కేవలం రుణాలు తీసుకోవడం, చెల్లించడానికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలు స్థిరమైన ప్రణాళికలను రూపొందించుకోవాలని, ప్రతి సమావేశంలో మండల స్థాయి అధికారులను ఆహ్వానించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి భవనాలలో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించుకోవడం ద్వారా పరస్పర అవగాహన పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన 113 ఇందిరా మహిళా శక్తి భవనాల్లో, 103 భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, ఈ విషయంలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ వెల్లడించారు. రాజేశ్వర్ రావు కాలనీలో భవన నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తి చేసినందుకు సంబంధిత అధికారులు, ప్రతినిధులను ఆమె అభినందించారు. మిగిలిన భవనాల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

అనంతరం గంభీరావుపేట మండల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన 'ఇందిరమ్మ నమూనా గృహాన్ని' కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పూర్తయిన 2,700 ఇందిరమ్మ ఇళ్లకు వచ్చే నెల ఒకటో తేదీన గృహప్రవేశాలు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**
జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ధర్మానికి ప్రతీకగా, భక్తికి నిలువెత్తు రూపంగా, అచంచలమైన సేవాభావానికి ఆదర్శంగా నిలిచిన ఆంజనేయ స్వామి వారి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్పూర్తిగా ప్రార్థించానని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలని, ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. హనుమంతుని భక్తి, అపారమైన బలం, నిస్వార్థ సేవా స్ఫూర్తిని తనకు ఆదర్శంగా తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత నిబద్ధతతో, బాధ్యతాయుతంగా ముందుకు సాగుతానని అన్నారు .

# ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో వేగం పెంచాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం...**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, మిల్లులు మరియు గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా తదితర శాఖల జిల్లా అధికారులతో బుధవారం ఉదయం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ళు, మిల్లుల్లో అన్ లోడింగ్ ప్రక్రియపై ఆమె ఆరా తీశారు. మిల్లుల వారీగా లక్ష్యం మేరకు ధాన్యం అన్ లోడింగ్ జరిగేలా చూడాలని, కొనుగోళ్ల శాతం పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.



కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగుల లభ్యత, చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అక్కడ అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆ వాహనాలను అవసరమున్న ఇతర కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని, ఇందుకోసం ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.

# విత్తనం కథా సంపుటికి రజినిశ్రీ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం భీముని మల్లారెడ్డిపేట కి చెందిన ప్రముఖ కథకులు, సినీ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రచించిన 'విత్తనం' కథా సంపుటి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక 'రజనిశ్రీ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం'కు ఎంపికైంది. ?ఈ విషయాన్ని పురస్కార కమిటీ కన్వీనర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ ఈ పురస్కారానికి ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 58 కథా సంపుటాలు అందగా, వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు లబ్ధ ప్రతిష్టులైన న్యాయ నిర్ణేతలు సుదీర్ఘ పరిశీలన జరిపారని అన్నారు . వారి నిర్ణయం మేరకు సిరిసిల్ల జిల్లా, భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన పెద్దింటి అశోక్ కుమార్ రచించిన 'విత్తనం' సంపుటిని విజేతగా ప్రకటించినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయడంతో పాటు నగదు బహుమతిని కూడా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు గాజుల రవీందర్, కార్యదర్శి నంది శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్తంభంకాడి గంగాధర్, కోశాధికారి ముత్తినేని శ్రీనివాస్ తదితరులు ఈ సందర్భంగా అశోక్ కుమార్ ని అభినందించారు.

# వేములవాడలో 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్' ప్రారంభం,

**తక్కువ ఖర్చుతో నాణ్యమైన భోజనం... ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**బలగం టీవీ, వేములవాడ:**
మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు నూతనంగా ఏర్పాటు చేసిన 'మెప్మా' క్యాంటీన్ ఢ క్యాటరింగ్ కేంద్రాన్ని రాజరాజేశ్వరి దేవి మహిళా స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ఈ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం ఇలాంటి క్యాంటీన్ల ఏర్పాటుకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వ్యాపార రంగంలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్యాంటిన్‌ను సందర్శించి, అక్కడ స్వయంగా భోజనం చేసి ఆహార రుచిని, నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వేములవాడ ప్రభుత్వాసుపత్రికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే పేద రోగులు, వారి సహాయకులతో పాటు, దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ క్యాంటీన్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కొనియాడారు. చాలా తక్కువ ఖర్చుతోనే అందరికీ నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం ఇక్కడ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. దీనివల్ల ఒకవైపు ప్రజలకు తక్కువ ధరకే భోజన వసతి దొరకడమే కాకుండా, మరోవైపు స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చక్కటి ఉపాధి లభించి వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు



నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు స్థానిక వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మెప్మా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్ళు


**నిరంతర పర్యవేక్షణలో ప్రత్యేక అధికారులు...**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. రైతులు పండించిన ధాన్యపు గింజను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రోజువారీగా సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

బుధవారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ప్రత్యేక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాగట్లపల్లి, బొప్పాపూర్‌లలోని కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, బోయినిపల్లి మండలం కోరెం, అనంతపల్లి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి శరత్, ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లి, బందనకల్ గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి రాఘవేందర్ తనిఖీ చేశారు. అలాగే గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, గజసింగవరం గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి హనుమంతు, వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం, చందుర్తి మండలం మూడపల్లి, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి, మారుపాక గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి పనులను సమీక్షించారు.

జిల్లాలో ఇప్పటికే ఎక్కువ శాతం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు, గోదాములకు విజయవంతంగా తరలించడం జరిగిందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం తడవకుండా ముందుగానే తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవడం వల్ల, మంగళవారం రాత్రి జిల్లాలో కురిసిన అకాల వర్షానికి ధాన్యానికి ఎలాంటి నష్టం సంభవించలేదని స్పష్టం చేశారు. రైతుల నుండి తూకం వేసి సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు తగినన్ని రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తగిన సూచనలు ఇస్తూ, కొనుగోళ్ళ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు మరియు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు.

# బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి..

**- బీజేపీ సిరిసిల్ల టౌన్ ప్రెసిడెంట్ దుమాల శ్రీకాంత్**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సమగ్ర సవరణ కార్యక్రమాలు ఎంతో కీలకమని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని బీజేపీ నాయకులు దుమాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు.బుధవారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రు నగర్ కనకదుర్గ దేవాలయం వద్ద నిర్వహించిన సార్ సమగ్ర సవరణ - - 2026 కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బీజేవైఎం అధ్యక్షులు రావుల రాజి రెడ్డి హాజరైనారు.?ఈ సందర్భంగా బీజేపీ సిరిసిల్ల టౌన్ ప్రెసిడెంట్ దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయి నాయకులు, అన్ని మోర్చాల ప్రతినిధులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, బి.ఎల్.ఓ-1, బి.ఎల్.ఓ-2 పోలింగ్ ఏజెంట్లు, సీనియర్ నాయకులు, పార్టీ అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన



కార్యదర్శి మెరుగు శ్రీనివాస్, అంకారాపు రాజు, భాను గాలి శ్రీనివాస్, భారత్, మహేష్, దూడం సురేష్, శేఖర్, బాగయ్య, సుంకరి బాలకిషన్, దేవేందర్ తదితర ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గోనె సంచుల కొరతకు సీఎం రేవంత్ కారణం

**బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

**బలగం టీవి, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన గోనె బస్తాలు అందుబాటులో లేకపోవడానికి సీఎం రేవంత్‌రెడ్డే కారణమని ఆరోపించారు. 'తెలంగాణ ప్రజల కష్టార్జిత ధనాన్ని మూటలకట్టుకుని ఢిల్లీకి తరలిస్తున్నారు. అందుకే రాష్ట్రంలో గోనె సంచులు కూడా దొరకని పరిస్థితి వచ్చింది" అని విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతోందని, తెలంగాణ డబ్బంతా బయటకు వెళ్తోందని ఆయన ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు.

# యుద్ధ భయాల నీడలో బులియన్ మార్కెట్..

**స్వల్పంగా తగ్గిన పసిడి, వెండి ధరలు..!**

**బలగం టీవి, హైదరాబాద్**

అంతర్జాతీయంగా ఇరాన్ – అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ఇప్పట్లో ముగిసే ఛాయలు కనిపించడం లేదు. ఈ అగ్రదేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు నెలకొనడంతో స్టాక్ మార్కెట్లు సైతం కుదేలైపోతున్నాయి. సురక్షిత పెట్టుబడిగా భావించే బులియన్ మార్కెట్ సైతం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. పసిడి ధరలతో పాటు వెండి ధరలలో కూడా భారీ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. అయితే, గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలకు చేరిన ధరలు బుధవారం మాత్రం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి.నేటి పసిడి, వెండి ధరల పట్టికదేశీయ బులియన్ మార్కెట్‌లో బుధవారం నమోదైన పసిడి, వెండి ధరల వివరాలు కింది విధంగా ఉన్నాయి:లోహం (రకం/పరిమాణం)నేటి ధర (రూపాయలలో)మార్పు (తగ్గుదల)24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)రూ. 1,58,290రూ. 600 మేర తగ్గింది22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)రూ. 1,45,100రూ. 550 మేర తగ్గిందికిలో వెండిరూ. 2,90,000రూ. 5,000 మేర పతనమైందిస్టాక్ మార్కెట్లలో టెన్షన్.. వెండికి భారీ షాక్!అంతర్జాతీయ యుద్ధ సంక్షోభం కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండటంతో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. బులియన్ మార్కెట్‌లో బుధవారం పసిడి ధరలు స్వల్పంగా ఊరటనివ్వగా, వెండి ధరలకు మాత్రం గట్టి షాక్ తగిలింది. ఒకే రోజు కిలో వెండిపై ఏకంగా రూ. 5,000 మేర తగ్గడం గమనార్హం. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 2,90,000 వద్ద కొనసాగుతోంది.ముమ్మందు ధరలు ఎలా ఉండొచ్చు?అంతర్జాతీయంగా పొలిటికల్ టెన్షన్స్ ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరలు మరింత అస్థిరంగా మారే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. యుద్ధ మేఘాలు విడిపోయే వరకు బులియన్ మార్కెట్‌లో ఈ తరహా ఒడిదుడుకులు సహజమని వారు పేర్కొంటున్నారు.

# తాగునీటితో దుకాణం క్లీనింగ్..
# 'ఆరెంజ్ ట్రీ' ఫర్నిచర్‌కు రూ. 10 వేల జరిమానా!

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ ఫైన్ తప్పదని జలమండలి హెచ్చరిక**

**స్వయంగా రంగంలోకి దిగి చర్యలు తీసుకున్న ఎండీ అశోక్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

నగరంలో ఒకవైపు ఎండ తీవ్రతతో పాటు నీటి కొరత పెరుగుతున్న తరుణంలో, తాగునీటిని నిర్లక్ష్యంగా వృథా చేసే వారిపై హైదరాబాద్ జలమండలి (ఎచ్ఎంఐబోర్డు) కొరడా ఝులిపించింది. బంజారాహిల్స్‌లో మంచినీటిని వృథా చేసినందుకు గాను ఒక వ్యక్తికి అధికారులు ఏకంగా రూ.10 వేల భారీ జరిమానా విధించారు. తాగునీటి బోర్డు సరఫరా చేసే శుద్ధి చేసిన జలాలను ఇతర వాణిజ్య, గృహేతర అవసరాలకు వినియోగించినందుకు గాను అధికారులు ఈ కఠిన చర్య తీసుకున్నారు.

బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 12లో గల ప్రముఖ 'ఆరెంజ్ ట్రీ ఫర్నిచర్' దుకాణం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సదరు దుకాణ ప్రాంగణాన్ని ఒక వ్యక్తి పైపుతో తాగునీటిని పడుతూ పూర్తిగా కడుగుతున్నాడు. అదే సమయంలో ఆ మార్గంలో తనిఖీలు నిర్వహిస్తూ వెళ్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి.. మంచినీటిని విచ్చలవిడిగా వృథా చేస్తున్న సదరు వ్యక్తిని స్వయంగా గమనించారు. వెంటనే కాన్వాయ్ ఆపి, అక్కడికక్కడే విచారణకు ఆదేశించారు. అది జలమండలి సరఫరా చేసే తాగునీరేనని నిర్ధారణ కావడంతో, ఎండీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు వ్యక్తికి అక్కడికక్కడే రూ.10 వేల జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేయించారు.

ఈ ఘటన నేపథ్యంలో నగర ప్రజలకు జలమండలి అధికారులు ముందస్తు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జలమండలి సరఫరా చేసే నీటిని కేవలం తాగడానికి, వంట వండుకోవడానికి మరియు అత్యవసర గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలి. ఇళ్ల ముందు రోడ్లు కడగడానికి, దుకాణాల ప్రాంగణాలు శుభ్రం చేయడానికి, వాహనాలను (కార్లు, బైకులు) కడగడానికి తాగునీటిని ఉపయోగిస్తే అస్సలు సహించేది లేదు. రానున్న రోజుల్లో నీటి వృథాను అరికట్టడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఇలాంటి భారీ జరిమానాలు మరియు కనెక్షన్ల కట్ వంటి చర్యలు తప్పవని బోర్డు స్పష్టం చేసింది.

# ఒడిదుడుకుల్లో ముగిసిన మార్కెట్లు..

**స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ**

**బలగం టీవి, హైదరాబాద్**

బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 141.90 పాయింట్లు కోల్పోయి 75,867.80 వద్ద ముగియగా, నిఫ్టీ 6.55 పాయింట్లు తగ్గి 23,907.15 వద్ద స్థిరపడింది.

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ, దక్షిణ ఇరాన్‌పై అమెరికా దాడులు జరిగాయన్న వార్తలు అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళనకు దారితీశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 23,800 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉంది. ఈ స్థాయి దిగువకు వెళ్లితే 23,600-23,500 వరకు పడిపోయే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, 24,000-24,100 స్థాయిలు బలమైన నిరోధకంగా మారాయని పేర్కొంటున్నారు.

నిఫ్టీలో ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో నిలిచాయి. మరోవైపు పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, ఎటర్నల్ షేర్లు రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. టాటా స్టీల్, ఇండిగో, మారుతీ సుజుకీ, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. ప్రధాన సూచీలు బలహీనంగా ముగిసినప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. రంగాల వారీగా చూస్తే బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు నష్టపోగా, మీడియా, మెటల్, ఆటో రంగాలు లాభపడ్డాయి.

# యూకేలో భారత సంతతి న్యూరో సర్జన్‌పై 8 నెలల సస్పెన్షన్

**మహిళా రోగితో వ్యక్తిగత, లైంగిక సంబంధం కొనసాగించడం, నిబంధనలకు విరుద్ధంగా మత్తు మందులు సూచించడంతో...**



**బలగం టీవి, లండన్**

లండయూకేలో భారత సంతతికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ చిరాగ్ పటేల్‌పై మెడికల్ ప్రాక్టీషనర్స్ ట్రైబ్యునల్ సర్వీస్ (ఎంపీటీఎస్) 8 నెలల సస్పెన్షన్ విధించింది. మహిళా రోగితో వ్యక్తిగత, లైంగిక సంబంధం కొనసాగించడం, నిబంధనలకు విరుద్ధంగా మత్తు మందులు సూచించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ చర్యలు తీసుకుంది.

వివరాల ప్రకారం, కార్డిఫ్‌లోని యూనివర్సిటీ హాస్పిటల్ ఆఫ్ వేల్స్‌లో డాక్టర్ చిరాగ్ పటేల్ న్యూరో సర్జన్‌గా సేవలందిస్తున్నారు. 2019లో వెన్నెముక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు ఆయన శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం వారిద్దరి మధ్య వ్యక్తిగత సంబంధం ఏర్పడి దాదాపు ఆరు నెలల పాటు కొనసాగినట్లు విచారణలో వెల్లడైంది. ఈ సమయంలో డాక్టర్ పటేల్ ఆమెకు అశ్లీల చిత్రాలు పంపినట్లు కూడా ట్రైబ్యునల్ గుర్తించింది. సంబంధం దెబ్బతిన్న తర్వాత 2022 మే నుంచి 2023 జనవరి మధ్యకాలంలో, డాక్టర్ పటేల్ ఆ మహిళకు మార్ఫిన్ సల్ఫేట్, డయాజెపామ్ వంటి మత్తు కలిగించే మందులను ఎలాంటి వైద్య రికార్డులు నమోదు చేయకుండా, ఆమె జనరల్ ఫిజీషియన్‌కు సమాచారం ఇవ్వకుండా సూచించినట్లు తేలింది.

ట్రైబ్యునల్ ఎదుట తన వాదన వినిపించిన డాక్టర్ పటేల్, ఆ సమయంలో తాను కుటుంబ సమస్యలతో మానసిక ఒత్తిడికి గురయ్యానని తెలిపారు. సంబంధాన్ని ముగించాలని ప్రయత్నించినప్పుడు ఆ మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేసిందని, విషయం బయటపెడతానని బెదిరించిందని ఆరోపించారు. తన ఉద్యోగం, ప్రతిష్ఠ దెబ్బతింటాయనే భయంతోనే పరిచయం కొనసాగించానని, మందులు సూచించానని చెబుతూ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.

అయితే డాక్టర్ పటేల్ వివరణను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. రోగి భద్రత కంటే వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చారని అభిప్రాయపడింది. వృత్తిపరమైన నైతిక హద్దులు మీరినందుకు శిక్షగా 8 నెలల సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే వేల్స్‌లో న్యూరోమాడ్యులేషన్ ప్రక్రియలలో ఆయనకు ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను దృష్టిలో ఉంచుకుని, వైద్య రిజిస్టర్ నుంచి పూర్తిగా తొలగించడం లేదని స్పష్టం చేసింది.

# గుజరాత్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టివేత..

**రూ.1150 కోట్ల కొకైన్ స్వాధీనం**

**బలగం టీవి, న్యూఢిల్లీ**



గుజరాత్‌లోని ముంద్రా తీర ప్రాంతంలో భారత తీర రక్షక దళం (క్ష్మీజ+), గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఊుూ) సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. మే 25-26 తేదీల్లో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో సుమారు 115 కిలోల కొకైన్‌ను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.1150 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

ఏటీఎస్ గుజరాత్ అందించిన ఖచ్చితమైన నిఘా సమాచారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఇంటర్‌సెప్టర్ బోట్లు, ఏటీఎస్ సిబ్బందితో కలిసి ముంద్రా యాంకరేజ్ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో ఓ కంటైనర్ నౌకలో అనుమానాస్పద కదలికలు గుర్తించిన బృందాలు వెంటనే అక్కడికి చేరుకుని సముద్రంలో పడేసిన ఐదు సంచులను స్వాధీనం చేసుకున్నాయి.

పరిశీలనలో ఆ సంచుల్లో తెల్లటి పొడి పదార్థంతో కూడిన ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. పరీక్షల్లో అవి కొకైన్‌గా నిర్ధారణ అయింది. మొత్తం 115 ప్యాకెట్లు, ఒక్కోటి సుమారు ఒక కిలో బరువుతో ఉండగా, మొత్తం 115 కిలోల మత్తు పదార్థాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత నౌకను మరింత దర్యాప్తు కోసం పోర్టుకు తరలించారు.

గత ఐదేళ్లలో ఐసీజీ-ఏటీఎస్ సంయుక్తంగా నిర్వహించిన మాదకద్రవ్యాల నిరోధక చర్యల్లో ఇది 15వ విజయవంతమైన ఆపరేషన్ అని అధికారులు తెలిపారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడంతో పాటు "నషా ముక్త్ భారత్" లక్ష్య సాధనలో భాగంగా ఇలాంటి చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తామని పేర్కొన్నారు.

# కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ సోదాలు!

- **కుమార్తె వీణా ఇల్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు**
- **మనీలాండరింగ్ కేసులో ఏకకాలంలో 12 చోట్ల ఈడీ పంజా**
- **హైకోర్టులో పిటిషన్ కొట్టివేసిన మరుసటి రోజే రంగంలోకి అధికారులు**



**బలగం టీవి, తిరువనంతపురం**

కేరళ రాజకీయాల్లో సంచలనం రేపుతూ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. విజయన్‌తో పాటు ఆయన కుమార్తె టి.వీణ నివాసంలోనూ ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. తీవ్ర సంచలనం సృష్టించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం నుంచే అధికారులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 ప్రాంతాల్లో ఏకకాలంలో రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె నివాసంతో పాటు, ఆయన కుమార్తె వీణాకు చెందిన ఐటీ కంపెనీ 'ఎక్సాలాజిక్ సొల్యూషన్స్' ఆర్థిక లావాదేవీలపై ఈడీ ప్రధానంగా ఆరా తీస్తోంది.

**రూ. 1.72 కోట్ల అక్రమ లావాదేవీల ఆరోపణలు**

కేసు వివరాల్లోకి వెళ్తే.. 'కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్' (జవీక్ష్మూ) అనే ప్రైవేట్ కంపెనీ నుంచి మాజీ సీఎం విజయన్ కుమార్తె వీణా కంపెనీకి అక్రమంగా నిధులు బదిలీ అయ్యాయనేది ప్రధాన ఆరోపణ. 2018-2019 మధ్యకాలంలో వీణాకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీ సదరు ప్రైవేట్ సంస్థకు ఎలాంటి సేవలు అందించనప్పటికీ.. సీఎంఆర్ఎల్ సంస్థ నుంచి రూ.1.72 కోట్లు అక్రమంగా చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సుదీర్ఘ విచారణ అనంతరం, 2024లో మనీలాండరింగ్ నిరోధక చట్టం (ూమీూ) కింద ఈడీ కేసు నమోదు చేసింది.

**హైకోర్టు తీర్పు వచ్చిన గంటల్లోనే యాక్షన్!**

ఈ కేసులో ఈడీ జరుపుతున్న దర్యాప్తును సవాల్ చేస్తూ, విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. సదరు సంస్థ అభ్యర్థనను తోసిపుచ్చుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలకు దిగడం గమనార్హం.

**గతంలోనే వివరణ ఇచ్చిన విజయన్**

తన కుమార్తెపై వస్తున్న ఆరోపణలను గతంలోనే మాజీ సీఎం పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన భార్య పదవీ విరమణ చేయగా వచ్చిన నిధులతోనే తన కుమార్తె సొంతంగా కంపెనీని ప్రారంభించిందని, అందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని అప్పట్లోనే ఆయన స్పష్టత ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈడీ తన దర్యాప్తును వేగవంతం చేస్తూ ఈ తనిఖీలు చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ సోదాలు కేరళ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# అన్నాడీఎంకేలో ముగిసిన 'విభేదాల' పర్వం..



- **ఈపీఎస్ చెంతకు చేరిన తిరుగుబాటు వర్గం!**
- **స్పీకర్‌కు ఇచ్చిన లేఖలను పరస్పరం ఉపసంహరించుకున్న నేతలు**
- **పళనిస్వామికి క్షమాపణలు చెప్పిన వేలుమణి, షణ్ముగం వర్గం**
- **25 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పిటిషన్ వెనక్కి.. సయోధ్య దిశగా అడుగులు**

**బలగం టీవి, చెన్నై**

తమిళనాడు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేలో గత కొద్దిరోజులుగా సాగుతున్న అంతర్గత విభేదాలకు ఎట్టకేలకు తెరపడింది. పార్టీ జనరల్ సెక్రటరీ ఎడప్పాడి కె.పళనిస్వామి (జుూూ) వర్గానికి, సీనియర్ నేతలు ఎస్.పి. వేలుమణి, సి.వి. షణ్ముగం వర్గానికి మధ్య మళ్లీ సయోధ్య కుదిరింది. గతంలో ఒకరికి ఒకరు వ్యతిరేకంగా అసెంబ్లీ స్పీకర్‌కు సమర్పించిన ఫిర్యాదు లేఖలు, పిటిషన్లను ఇరు వర్గాలు అధికారికంగా వెనక్కు తీసుకోవడంతో పార్టీలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠ ముగిసిపోయింది. ఈ పరిణామంతో అన్నాడీఎంకే శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

**క్షమాపణ లేఖతో ఈపీఎస్ వద్దకు..**

పార్టీలో తీవ్ర కలకలం రేపిన ఈ వివాదం మంగళవారం ఒక కీలక మలుపు తిరిగింది. ఎస్.పి. వేలుమణి నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన పరిణామాలపై వారు ఈపీఎస్?కు క్షమాపణ తెలుపుతూ ఒక అధికారిక లేఖను సమర్పించారు. ఈ భేటీ ముగిసిన కొద్దిసేపటికే, వేలుమణి నేరుగా తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకరన్‌ను కలిసి, తాము అంతకుముందు ఇచ్చిన లేఖను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

**అసలేం జరిగింది? పరస్పర లేఖల యుద్ధం!**

ఇటీవలి ఎన్నికల అనంతరం అన్నాడీఎంకేలో నాయకత్వ మార్పుపై భేదాభిప్రాయాలు వ్యూహాత్మకంగా మారాయి. వేలుమణి-షణ్ముగం వర్గం లేఖ: ఈపీఎస్ నాయకత్వానికి వ్యతిరేకంగా స్పీకర్‌కు లేఖ సమర్పించిన ఈ వర్గం.. అన్నాడీఎంకేకు కొత్త శాసనసభాపక్ష నేతను, కొత్త చీఫ్ విప్‌ను నియమించాలని కోరింది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ తిరుగుబాటు వర్గం అధికారిక 'టీవీకే' పార్టీకి మద్దతు ఇస్తోందన్న ప్రచారంతో ఈపీఎస్ వర్గం అప్రమత్తమైంది. సదరు వర్గంలోని 25 మంది ఎమ్మెల్యేలపై 'ఫిరాయింపు నిరోధక చట్టం' కింద అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్‌కు పిటిషన్ సమర్పించింది. తాజా సయోధ్యతో ఈ రెండు వర్గాలు తమ పిటిషన్లను అధికారికంగా ఉపసంహరించుకున్నాయి.

**మా మధ్య ఉన్నవి చిన్నచిన్న అభిప్రాయ భేదాలే: ఎస్.పి. వేలుమణి**

పళనిస్వామితో భేటీ అనంతరం అన్నాడీఎంకే సీనియర్ నేత, కోయంబత్తూరు ఎమ్మెల్యే ఎస్.పి. వేలుమణి మీడియాతో మాట్లాడారు. "ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్టీ బాగుపడాలనే ఉద్దేశంతోనే మేము కొన్ని సలహాలు ఇచ్చాం. వందేళ్ల తర్వాత కూడా అన్నాడీఎంకే బలంగా ఉండాలనేదే మా ఆశ. మా పార్టీ ముక్కలు కాలేదు, కేవలం మా ఆలోచనల్లోనే చిన్న తేడాలు వచ్చాయి. పళనిస్వామి గారే ఇప్పటికీ మా పార్టీకి అసలైన నేత. మేము ఎలాంటి పదవుల కోసం ఆశపడి ఇలా చేయలేదు. పార్టీ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి, ఒక కమిటీ వేయాలని లీడర్‌ను కోరాం, ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ఇప్పుడు మేమంతా ఒక్కటయ్యాం, కలిసికట్టుగా ఉన్నాం" అని స్పష్టం చేశారు.

**షణ్ముగం హాజరుకాకపోవడంపై స్పష్టత**

ఈ కీలక సమావేశానికి మరో సీనియర్ నేత సీవీ షణ్ముగం హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే దీనిపై వేలుమణి స్పందిస్తూ.. షణ్ముగం కూడా తమతోనే ఉన్నారని, అందరం కలిసికట్టుగానే ఈ నిర్ణయం తీసుకున్నామని మీడియా ముఖంగా స్పష్టం చేశారు. ఈ తాజా పరిణామాలతో తమిళనాడు రాజకీయాల్లో అన్నాడీఎంకే తిరిగి బలపడే దిశగా అడుగులు వేస్తోంది.

# సాంకేతిక లోపంతో ఢిల్లీకి తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం

**బలగం టీవి, న్యూఢిల్లీ**




శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరిన ఎయిరిండియా విమానం సాంకేతిక లోపం కారణంగా మధ్యలోనే తిరిగి ఢిల్లీకి చేరుకుంది. సుమారు 230 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఈ విమానం ఎనిమిది గంటలకు పైగా గాల్లో ప్రయాణించిన అనంతరం వెనుదిరిగింది.

ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 777-300 ఈఆర్ విమానం బుధవారం ఢిల్లీ నుంచి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరింది. ప్రయాణ మధ్యలో చైనా గగనతలంలో ఉండగా సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా విమానాన్ని తిరిగి ఢిల్లీకి మళ్లించినట్లు వెల్లడించారు. సాంకేతిక లోపం కారణంగా విమానం కొంతసేపు గాల్లోనే చక్కర్లు కొట్టిన అనంతరం ఢిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. సమస్యను పరిష్కరించేందుకు ఇంజినీరింగ్ బృందాలు చర్యలు చేపట్టినట్లు ఎయిరిండియా పేర్కొంది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యంపై చింతిస్తున్నామని, వారిని వీలైనంత త్వరగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ అధికారులు తెలిపారు.

# ఆశారాం బాపూకు భారీ ఎదురుదెబ్బ.. జీవిత ఖైదును సమర్థించిన రాజస్థాన్ హైకోర్టు

**బలగం టీవి, జైపూర్**



మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూకు రాజస్థాన్ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. కింది కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను హైకోర్టు సమర్థిస్తూ ఆయన దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను బుధవారం కొట్టివేసింది. ప్రస్తుతం మధ్యంతర వైద్య బెయిల్‌పై బయట ఉన్న 86 ఏళ్ల ఆశారాం వెంటనే అధికారుల ఎదుట లొంగిపోవాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న శిల్పి, శరత్‌చంద్‌లను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ అరుణ్ మోంగా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

వివరాల ప్రకారం, 2013 ఆగస్టులో జోధ్‌పూర్‌లోని ఆశ్రమంలో మైనర్ బాలికపై ఆశారాం లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం జోధ్‌పూర్ ప్రత్యేక పోక్సో కోర్టు 2018 ఏప్రిల్ 25న ఆశారాంను దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై 2026 ఫిబ్రవరి 16 నుంచి ఏప్రిల్ 20 వరకు హైకోర్టు రోజువారీ విచారణ నిర్వహించి తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం తుది తీర్పును ప్రకటించింది.

విచారణ సందర్భంగా ఆశారాం తరఫు న్యాయవాదులు కేసు కట్టుకథ అని వాదించారు. బాధితురాలి తల్లిదండ్రుల వాంగ్మూలాల్లో వైరుధ్యాలు ఉన్నాయని, ఘటన జరిగిన రాత్రి ఆశారాంకు, బాధితురాలికి మధ్య ఎలాంటి ఫోన్ కాల్స్ జరగలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదే ఆధారాలతో కొందరు సహ నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారని, ఆశారాంను కూడా దోషిగా పరిగణించరాదని వాదించారు.

అయితే ప్రాసిక్యూషన్, బాధితురాలి తరఫు న్యాయవాది పి.సి. సోలంకి ఈ వాదనలను ఖండించారు. పోక్సో చట్టం ప్రకారం బాధితురాలి వాంగ్మూలమే శిక్ష విధించేందుకు సరిపోతుందని, దీనిని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు సాక్షులపై దాడులు, హత్యలు కూడా జరిగాయని కోర్టుకు వివరించారు. ఇప్పటికే గుజరాత్‌లోని గాంధీనగర్ ఆశ్రమంలో మరో మహిళపై లైంగికదాడి కేసులో ఆశారాం దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. 2023 జనవరిలో ఆ కేసులో ఆయనకు శిక్ష పడింది. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో పలుమార్లు బెయిల్ కోరిన ఆశారాంకు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు మధ్యంతర వైద్య బెయిల్ మంజూరు చేసింది. తాజా తీర్పుతో ఆయన మళ్లీ జైలుకు వెళ్లడం ఖాయమైంది.



# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

**డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత హెచ్చరిక**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు కఠిన శిక్షలు విధిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం జిల్లా పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశం డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భస్థ పూర్వ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం-1994 ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు మరియు స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలలో చట్టం ప్రకారం అవసరమైన సర్టిఫికెట్లు, రికార్డులను పరిశీలించి నివేదికలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో లింగ నిష్పత్తి మెరుగుపర్చడంతో పాటు ఆడ శిశు హత్యలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గర్భధారణ అనంతరం పిండం లింగ నిర్ధారణ చేయడం పూర్తిగా నిషేధమని, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే సంబంధిత స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు రూ.10 వేల జరిమానా, మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, పెంటా శ్రీనివాస్, జిల్లా పబ్లిక్ రిలేషన్ అధికారి ఏడుకొండలు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సుచేతన లక్ష్మి, పీడియాట్రిషన్ డాక్టర్ పరమేష్, ఎన్‌జీవో ప్రతినిధి చింతోజ్ భాస్కర్, పీఓ ఎంహెచ్‌ఎన్ డాక్టర్ నాగేంద్రబాబు, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు కఠిన నిబంధనలు

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

?పని ప్రదేశంలో మహిళలు స్వేచ్ఛగా, నిర్భయంగా పనిచేసేలా ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలి లో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేధము పరిష్కారాల చట్టం 2013పై జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.జిల్లావ్యాప్తంగా ఉన్న 278 ఇంటర్నల్ కమిటీ సభ్యులను ఆహ్వానించి వారికి అంతర్గత ఫిర్యాదుల కమిటీ గురించి వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ



నిబంధనలు ఉల్లంఘిస్తే ఉద్యోగ తొలగింపుతో పాటు జైలు శిక్ష, 50 వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యాలయంతో పాటు విధుల నిమిత్తం వెళ్లే ప్రయాణాలు, ఫీల్డ్ ట్రిప్పులు అన్నీ పని ప్రదేశం పరిధిలోకి వస్తాయని, రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అనే తేడా లేకుండా మహిళా ఉద్యోగులందరికీ ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొన్నారు.

పది మంది కంటే ఎక్కువ మంది పనిచేసే చోట తప్పనిసరిగా ఇంటర్నల్ కమిటీని ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఇతర శాఖల ద్వారా ఆ బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి 'షి-బాక్స్' పోర్టల్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. త్వరలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఫిజికల్ షి-బాక్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని, బాధితులకు న్యాయం చేయడంతో పాటు చట్టాన్ని దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు .కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం శిక్షకులు ప్రభాకర్, జిల్లా లోకల్ లెవెల్ కమిటీ సభ్యులు అఫ్జల్ బేగం,జ్యోతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, సిడిపివోలు సౌందర్య, ఉమారాణి , సుచరిత, డీ హబ్

## ఐఎంఎస్ భవన పనుల్లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లా ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. భవనంలోని అన్ని గదులను సందర్శించి పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణ పనులను వచ్చే నెల జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మహేష్‌కుమార్, పీఆర్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీలోకి వలసల వెల్లువ

**కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ వార్డ్ సభ్యులు**

**కండూవా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వ ప్రగతికి ఆకర్షితులయ్యే చేరికలన్న మండల అధ్యక్షులు సువీన్ యాదవ్**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈరోజు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం గారి సమక్షంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలోని ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ చేరికల కార్యక్రమం జరిగింది.

**సువీన్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ లో చేరికలు:**

బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ గారి ఆధ్వర్యంలో వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెసు పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారు కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో సాగుతున్న ప్రజా పాలన, నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న విద్యా, మౌలిక వసతుల ప్రగతిని చూసి ఇతర పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నమ్ముక ొని వచ్చిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత, రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు.




**మండలంలో తిరుగులేని శక్తిగా కాంగ్రెస్:**

మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గారి మార్గదర్శకత్వంలో బోయినిపల్లి మండలంలో చేరికలు జరగడం హర్షణీయమన్నారు. వెంకట్రావుపల్లి నాయకుల చేరికతో గ్రామంలో పార్టీ మరింత పటిష్టంగా మారిందని, రాబోయే రోజుల్లో మండలాన్ని కాంగ్రెస్ కిల్లాగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే గారి సేవలను బలోపేతం చేయడానికే తాము పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి సర్పంచ్ ఇరువాలా సంధ్యా మహేందర్, పొనుగంటి ఇంద్రారెడ్డి, 4 వ వార్డు సభ్యులు దూస రాజశేఖర్, మైదాపు సాయి కృష్ణ, నల్లాల శ్రీకాంత్, 8 వ వార్డ్ సభ్యులు సవానపెల్లి విక్రమ్ కిషోర్, సవనపెల్లి వినయ్, సవనపెల్లి శ్రీకాంత్, సవనపెల్లి మధు మండల కాంగ్రెస్ నాయకులు దయ్యాల రాజశేఖర్, మొగులోజీ రజినీకాంత్ అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరి కొయ్య కాళ్ళను కాల్చకుండ రోటో వేటర్‌తో భూమిలో కలియ దున్నాలి

**మండల వ్యవసాయ అధికారి ప్రణీత**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రైతులు వరి కొయ్యకాళ్లను కాల్చకుండా రోటవేటర్‌తో భూమిలో కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి ప్రణీత సూచించారు. వానాకాలం పంట సాగుకు ముందుగా వరి అవశేషాలను భూమిలో కలిపితే నేల సారవంతం అవుతుందని తెలిపారు. ఒక ఎకరానికి 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేస్తూ వరి కొయ్యకాళ్లను రోటవేటర్‌తో కలియదున్నితే అవి త్వరగా మురుగుతాయని పేర్కొన్నారు. ఒక టన్ను వరి కొయ్యకాళ్ల మురగడం వల్ల 386 కిలోల సేంద్రియ కార్బన్ నేలకు అందుతుందని వివరించారు. వరి కొయ్యకాళ్లను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు, సేంద్రియ కార్బన్ పూర్తిగా నశిస్తాయని హెచ్చరించారు. అలాగే మంటలు వ్యాపించి మోటార్లు, పైపులు, విద్యుత్ వైర్లు, పశువుల కొట్టాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో మంటలను అదుపు చేసే ప్రయత్నంలో రైతుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతోందని తెలిపారు. రైతులు వేసవిలోనే దుక్కులు పూర్తి చేసుకోవాలని సూచించిన ఆమె.. పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించారు. జీలుగ విత్తనాలను ఎకరానికి 12 కిలోల చొప్పున విత్తి, పూత దశలో కలియదున్నితే ఎకరానికి 6 నుంచి 8 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని తెలిపారు. దీని ద్వారా రెండు బస్తాల యూరియా వరకు ఆదా చేసుకోవచ్చని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రణీత విజ్ఞప్తి చేశారు.

## పేకాట స్థావరంపై పోలీసు అధికారులు దాడి

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామ శివారులో బుధవారం కొంతమంది డబ్బులు పెట్టుకుని "3 కార్డ్స్" పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బోయినిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు.వారి వద్ద నుండి రూ.2,170/- నగదు మరియు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినిపల్లి ఎస్సై ఎన్. రమాకాంత్ తెలిపారు.





# హైదరాబాద్ కథ ముగిసే!

**ఎలిమినేటర్‌లో 47 పరుగుల తేడాతో రాజస్థాన్ ఘన విజయం**

**29 బంతుల్లో 97 పరుగులతో చెలరేగిన 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ**

**క్వాలిఫయర్-2కు దూసుకెళ్లిన రాయల్స్.. గుజరాత్‌తో శుక్రవారం ఢీ**

**బలగం టీవి, ముల్లాన్‌పూర్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రయాణం ముగిసింది. బుధవారం ఇక్కడి మహారాజా యాదవీంద్ర సింగ్ స్టేడియం వేదికగా జరిగిన 'చావో రేవో' ఎలిమినేటర్ పోరులో ఆరెంజ్ ఆర్మీ చేతులెత్తేసింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన హైదరాబాద్ 47 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుని టోర్నీ నుంచి నిష్క్రమించింది. రాజస్థాన్ రాయల్స్ 'బోయ్ వండర్', 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (29 బంతుల్లో 97) ఆకాశమే హద్దుగా సిక్సర్ల వర్షం కురిపించి హైదరాబాద్ పతనాన్ని శాసించాడు. ఈ విజయంతో రాజస్థాన్ క్వాలిఫయర్-2కు అర్హత సాధించగా.. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది.

**సూర్యవంశీ ఊచకోత.. రాజస్థాన్ భారీ స్కోరు**

టాస్ గెలిచిన సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మొదట బౌలింగ్ ఎంచుకోగా.. ఆ నిర్ణయాన్ని తప్పుబడుతూ రాజస్థాన్ బ్యాటర్లు స్టేడియాన్ని బౌండరీలతో హోరెత్తించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లోనే 5 ఫోర్లు, 12 భారీ సిక్సర్లతో 97 పరుగులు చేసి తృటిలో రికార్డు శతకాన్ని చేజార్చుకున్నాడు. ముఖ్యంగా ప్యాట్ కమిన్స్ వేసిన ఒకే ఓవర్‌లో అతను 25 పరుగులు పిండుకోవడం గమనార్హం. అతనికి తోడు ధ్రువ్ జురెల్ (21 బంతుల్లో 50) మెరుపు అర్ధసెంచరీతో రాణించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల హిమాలయ స్కోరు బోర్డుపై ఉంచింది. హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే 3 వికెట్లు పడగొట్టాడు.




**చేతులెత్తేసిన హైదరాబాద్ బ్యాటర్లు!**

244 పరుగుల భారీ లక్ష్యఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. జోఫ్రా ఆర్చర్ వేసిన తొలి ఓవర్‌లోనే ఓపెనర్ అభిషేక్ శర్మ (0) డకౌట్‌గా వెనుదిరిగి షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (33), ట్రావిస్ హెడ్ (17) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. రవిచంద్రన్ స్మరణ్‌ను వన్ డౌన్ పంపిన ప్రయోగం కూడా విఫలమైంది. పవర్‌ప్లే ముగిసేసరికే 4 కీలక వికెట్లు కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ అప్పుడే ఓటమిని కొనితెచ్చుకుంది.

**నితీష్ రెడ్డి పోరాడినా.. తప్పని పరాజయం!**

మిడిల్ ఆర్డర్‌లో హెన్రీచ్ క్లాసెన్ (18), నితీష్ కుమార్ రెడ్డి (38) ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసినా లక్నో బౌలర్లు రన్‌రేట్ ఒత్తిడి పెంచేశారు. డేంజరస్ క్లాసెన్‌ను యశ్‌రాజ్ పుంజా బోల్తా కొట్టించగా, ఆ తర్వాత సలీల్ అరోరా (35)తో కలిసి నితీష్ కాసేపు పోరాడాడు. అయితే పెరిగిపోతున్న రన్‌రేట్ ఒత్తిడిలో వీరిద్దరినీ రవీంద్ర జడేజా తన వరుస ఓవర్లలో క్యాచ్ అవుట్‌గా పెవిలియన్ చేర్చడంతో హైదరాబాద్ ఓటమి ఖాయమైంది. ఆఖరిలో శివాంగ్ కుమార్ (27) కాసేపు ప్రతిఘటించినా.. సన్‌రైజర్స్ 19.1 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌట్ అయింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ (3/58) మూడు వికెట్లతో రాణించాడు.

**సంక్షిప్త స్కోరు బోర్డు:**

రాజస్థాన్ రాయల్స్: 20 ఓవర్లలో 243/8 (వైభవ్ సూర్యవంశీ 97, ధ్రువ్ జురెల్ 50; ప్రఫుల్ హింగే 3/54, నితీష్ కుమార్ రెడ్డి 1/12)

సన్‌రైజర్స్ హైదరాబాద్: 19.1 ఓవర్లలో 196 ఆలౌట్ (నితీష్ కుమార్ రెడ్డి 38, సలీల్ అరోరా 35, ఇషాన్ కిషన్ 33; జోఫ్రా ఆర్చర్ 3/58, రవీంద్ర జడేజా 2/??)

ఫలితం: 47 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం (క్వాలిఫయర్-2కు అర్హత).

## క్రికెటర్లు వ్యాపార సామ్రాజ్య అధిపతులే..!?

**బలగం టీవి, న్యూఢిల్లీ**




క్రికెట్ అంటే భారత్‌లో కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు. అది ఒక భావోద్వేగం. ఒక మతం. అయితే ఆధునిక కాలంలో క్రికెట్ అనేది కేవలం బ్యాట్, బాల్‌కు పరిమితం కాకుండా ఒక భారీ వ్యాపార సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎలైట్ క్రికెటర్లు ఇప్పుడు కేవలం ప్రొఫెషనల్ కాంట్రాక్టుల ద్వారానే కాకుండా, అంతర్జాతీయ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు, తెలివైన వాణిజ్య పెట్టుబడుల ద్వారా భారీగా సంపదను ఆర్జిస్తున్నారు. 2026 నాటికి ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెటర్ల జాబితాను పరిశీలిస్తే, భారతీయ ఆటగాళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం తరం క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ ఆటతోపాటు స్టైల్ ఐకాన్‌గా ఉన్నారు. దీంతో కోహ్లీ ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగారు. కోహ్లీ నికర ఆస్తి విలువ దాదాపు వెయ్యికోట్లకుపైగా ఉంది. కోహ్లీ ఆదాయం కేవలం బీసీసీఐ కాంట్రాక్టులు లేదా ఐపీఎల్ పారితోషికాలకే పరిమితం కాలేదు. అతను ప్రీమియం ఫ్యాషన్ లేబుల్స్, ఫిట్‌నెస్ సెంటర్ చైన్‌లు, మిలియన్ డాలర్ల కార్పొరేట్ అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్ల ద్వారా భారీ రెవెన్యూ జనరేట్ చేస్తున్నారు. కోహ్లీ కేవలం ఒక ఆటగాడిగానే కాకుండా, ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా తన ముద్రవేస్తున్నారు. భారత్ మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ తన ఆదాయ వనరులను వైవిధ్యంగా మార్చుకోవడంలో సిద్ధహస్తుడని నిరూపించుకున్నాడు. ప్రస్తుతం ధోనీ ఆస్తి విలువ కోహ్లీతో సమానంగా వెయ్యి కోట్లు ఉంది. ధోని తన ఆర్థిక పోర్ట్‌ఫోలియోను కేవలం క్రికెట్‌కే పరిమితం చేయలేదు. కమర్షియల్ ఆర్గానిక్ ఫార్మింగ్, ఫిట్‌నెస్ బ్రాండ్లు, బైక్ కలెక్షన్స్, డొమెస్టిక్ లీగ్ కాంట్రాక్టుల ద్వారా తన సంపదను నిరంతరం పెంచుకుంటున్నారు. ధోనీ పక్కా ప్లానింగ్‌తో రిటైర్మెంట్ తర్వాత కూడా ఆర్థికంగా ఎలా బలంగా ఉండాలో ప్రపంచానికి చూపిస్తున్నాడు. క్రికెట్ గాడ్‌గా పిలుచుకునే సచిన్ టెండూల్కర్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకుని దశాబ్దం దాటినా, సంపాదనలో మాత్రం ఇప్పటికీ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. సచిన్ టెండూల్కర్ నికర ఆస్తుల విలువ సుమారు 1400కోట్లు దాటినట్టు అంచనా. సచిన్ తన కెరీర్ ముగిసిన తర్వాత కూడా హై ప్రొఫైల్ బ్రాండ్ అసోసియేషన్ల ద్వారా తన సంపద పెంచుకుంటున్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వ్యూహాత్మక వ్యాపార పెట్టుబడులు పెట్టడం ద్వారా తన ఆర్థిక సామ్రాజ్యాన్ని పటిష్టం చేసుకున్నారు. క్రికెట్ ఆడుతున్నప్పుడు ఎంతటి క్రమశిక్షణతో ఉండేవారో,రిటైర్మెంట్ తర్వాత కూడా తన బ్రాండ్ వాల్యూ తగ్గకుండా జాగ్రత్త పడటమే సచిన్ విజయ రహస్యం. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ప్రపంచ ధనిక క్రికెటర్ల జాబితాలో నాల్గో స్థానంలో ఉన్నారు. పాటింగ్ తన కెరీర్ ముగిసిన తర్వాత కూడా క్రికెట్‌తో విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నారు. అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు కోచింగ్ కాంట్రాక్టులు, అత్యధిక పారితోషికం లభించే మీడియా కామెంటరీ ద్వారా తన సంపద పెంచుకుంటున్నారు. వెస్టిండీస్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారా టాప్ 5 జాబితాలో ఉన్నారు. లారా తన లెజెండరీ హోదాను అద్భుతంగా వాడుకుంటున్నారు. బ్రాడ్ కాస్టింగ్ డీల్స్, ప్రీమియం కమర్షియల్ స్పాన్సర్‌షిప్‌ల ద్వారా డబ్బులు సంపాదిస్తున్నారు. క్రికెట్ ప్రపంచంలో ఈ స్థాయి సంపద చేకూరడానికి ప్రధాన కారణం. గ్లోబలైజేషన్ గతంలో క్రికెటర్లు కేవలం మ్యాచ్ ఫీజులపైనే ఆధారపడే వారు. కానీ ఐపీఎల్ వంటి లీగ్‌లు ఆటగాళ్ల బ్రాండ్ వాల్యూను అమాంతం పెంచేశాయి. సోషల్ మీడియా ద్వారా ఆటగాళ్లు నేరుగా అభిమానులతో కనెక్ట్ అవ్వడం వల్ల బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు కోట్లలో వస్తున్నాయి. నేటి క్రికెటర్లు సంపాదించిన డబ్బును స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్‌లలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఈ జాబితాలో టాప్ 3లో ఇండియన్ క్రికెటర్లే ఉన్నారు. ఇది భారత్ ఆటగాళ్ల బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి తెలియజేస్తుంది.

## రాజా రణధీర్ కన్నుమూత

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత మాజీ షుటర్, ఒలింపియన్ రణధీర్ సింగ్ (79) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రణధీర్ బుధవారం దిల్లీలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. రణధీర్ మరణాన్ని నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి రాజీవ్ భాటియా ధ్రువీకరించారు. భారత క్రీడా రంగంలో రాజా రణధీర్? చెరగని ముద్ర వేశారు. ఆయన మరణంతో క్రీడా లోకం దిగ్భ్రాంతికి గురైంది. పంజాబ్‌లోని పాటియాలా రాజ కుటుంబంలో రణధీర్ సింగ్ జన్మించారు. ఆయనకు భార్య వినిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందులో చిన్న కుమార్తె రాజేశ్వరి కూడా ఒక షుటర్ కావడం విశేషం. అయితే కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య సమస్యల కారణంగానే ఇటీవల ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఉజూ) అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేశారు. ఇక బుధవారం దిల్లీలోని ఆయన నివాసంలోనే కన్నుమూశారు. రణధీర్ తన కెరీర్‌లో అనేక ప్రధాన మైలురాళ్లు సాధించారు. 1978 ఆసియా క్రీడల్లో ట్రాప్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచారు. దీంతో భారత్ తరఫున స్వర్ణ పతకం గెలిచిన భారత తొలి షుటర్‌గా రణధీర్ సింగ్ చరిత్ర సృష్టించారు. బ్యాంకాక్ వేదికగా జరిగిన ఈ క్రీడల్లో ట్రాప్ ఈవెంట్‌లో చరిత్రాత్మక స్వర్ణ పతకం గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారు.ఆ తర్వాత క్రమంగా గొప్ప షుటర్లలో ఒకరిగా ఎదిగారు. ఆయన రికార్డు స్థాయిలో ఐదు ఒలింపిక్ క్రీడల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించారు. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియాకు రణధీర్ 1991 నుంచి 2015 వరకు సెక్రటరీ జనరల్‌గా సేవలందించారు. ఇక 2024 సెప్టెంబర్‌లో దిల్లీలో జరిగిన ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా 44వ సర్వసభ్య సమావేశంలో రణధీర్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి భారతీయుడిగానూ నిలిచారు. ఈ పదవిలో రణధీర్ 2028 దాకా ఉండాల్సింది. అయితే, ఈ ఏడాది ప్రారంభంలో ఆరోగ్యం క్షీణించడం వల్ల ఆయన పదవికి రాజీనామా చేశారు. రణధీర్ సింగ్ భారత, ఆసియా క్రీడా సంస్థలలో వివిధ పరిపాలనా పదవులను కూడా నిర్వహించారు.



## టీ20 క్రికెట్ హిస్టరీలోనే సరికొత్త మైలురాయి

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఇండియన్ ప్రీమియర్ లీ 2026 క్వాలిఫయర్ 1 మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పతిదార్ హిస్టారికల్ పర్ఫార్మెన్స్ తో సరికొత్త చరిత్ర సృష్టించాడు. మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన హై-వోల్టేజ్ పోరులో పాటిదార్ బౌండరీల వర్షం కురిపించాడు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 33 బంతుల్లోనే 5 ఫోర్లు, 9 భారీ సిక్సర్ల సాయంతో 93 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్ ఆడే క్రమంలో ఆయన ఐపీఎల్ 2026 సీజన్ లో తన మొత్తం సిక్సర్ల సంఖ్యను 41 కి చేర్చాడు. ఈ అద్భుతమైన ఫీట్ ద్వారా ఒకే టీ20 టోర్నమెంట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన కెప్టెన్‌గా ప్రపంచ క్రికెట్ లోనే సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఒకే టీ20 సిరీస్ లేదా టోర్నమెంట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన కెప్టెన్ రికార్డు గతంలో రాజస్థాన్ రాయల్స్ ప్రెసెంట్ కెప్టెన్ రియాన్ పరాగ్ పేరిట ఉండేది. 2023-24 డొమెస్టిక్ సీజన్ లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అస్సాం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ మొత్తం 40 సిక్సర్లను పరాగ్ సాధించాడు. తాజా మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ పై 9 సిక్సర్లు బాదడం ద్వారా రజత్ పతిదార్ ఆ మార్కును అధిగమించి 41 సిక్సర్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. పతిదార్ బ్యాటింగ్ పవర్ చూసి స్టేడియంలోని ఫ్యాన్స్ అంతా ఫుల్ జోష్ లో మునిగిపోయారు.ఇక ఐపీఎల్ రికార్డుల విషయానికి వస్తే ఒకే ఐపీఎల్ సీజన్ లో కెప్టెన్‌గా అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు ఇప్పటివరకు శ్రేయస్ అయ్యర్ పేరిట ఉండేది. ఆయన ఐపీఎల్ 2025 సీజన్ లో పంజాబ్ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహిస్తూ 39 సిక్సర్లు బాదాడు. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా పాటిదార్ ఆ రికార్డును ఈజీగా క్రాస్ చేశాడు. ఒక ఐపీఎల్ ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఏకైక కెప్టెన్‌గా సరికొత్త మైలురాయిని సెట్ చేశాడు. కెప్టెన్సీ ప్రెజర్ ఉన్నప్పటికీ పతిదార్ ఆడిన ఇన్నింగ్స్ ఆర్‌సీబీని మెరుగైన స్థితిలో నిలిపింది.గుజరాత్ తో జరిగిన ఈ నాకౌట్ మ్యాచ్ లో పతిదార్ సిక్సర్ల విధ్వంసం అతడిని ఐపీఎల్ ఎలైట్ లిస్ట్ లో చేర్చింది. ఒకే మ్యాచ్ లో 9 సిక్సర్లు కొట్టడం ద్వారా ఐపీఎల్ లో ఒక ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన వీరుల జాబితాలో విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్, ఇషాన్ కిషన్ వంటి ప్లేయర్లను ఆయన వెనక్కి నెట్టారు.

# కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే



కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫోటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల




ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.


# ట్రోలర్స్‌ను పెద్దగా పట్టించుకోను

## పెద్ది మూవీపై జగపతిబాబు




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు. ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారని అన్నారు. అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారని స్పష్టం చేశారు.

# పెద్ది మూవీ జపాన్‌లో విడుదల లేనట్లే




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో పెద్ది సినిమాను కూడా జపాన్‌లో ఒకేసారి విడుదల చేస్తే మంచి స్పందన వస్తుందని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. జపాన్ అభిమానులు కూడా ఈ వార్తతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్ల జపాన్‌లో పెద్ది సేమ్ డే రిలీజ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో జూన్ 4న సినిమా అక్కడ విడుదల కాన్లట్లైంది. ఈ వార్తతో జపాన్‌లోని రామ్‌చరణ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రేక్షకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక పెద్ది చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

# మా ఊరి వాతావరణమే ఎల్లమ్మకు చేరువ చేసింది




బలగం వేణు దర్శకత్వం వహిస్తున్న ఎల్లమ్మలో హీరోగా దేవిశ్రీప్రాసద్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పార్ట్ మొదలయ్యింది. తాను కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాని చేయడానికి స్ఫూర్తినిచ్చిన విషయాల్ని ఓ వీడియోతో పంచుకున్నారు దేవిశ్రీప్రసాద్. సంగీత దర్శకుడిగా సుపరిచితమైన ఆయన కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాతో తెరకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. వేణు ఎల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల దేవిశ్రీ ప్రసాద్ తన స్వగ్రామమైన వెదురుపాకని సందర్శించి, ఆ ఊరి జాతర వేడుకల్లో భాగమయ్యారు. అందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ 'మా నాన్న జన్మించిన ఊరు వెదురుపాక. ప్రకృతి, గ్రామీణ జీవన సౌందర్యం గురించి తెలుసుకోవాలని మా నాన్న చిన్నప్పుడు మమ్మల్ని తరచూ చెన్నై నుంచి వెదురుపాక తీసుకొచ్చేవారు. మా మూలాలతో, మనుషులతో అనుబంధం కొనసాగాలని ఇక్కడే ఓ అందమైన ఇల్లు కూడా నిర్మించుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం ఎంత అందమైనవో నాకు నేర్పిన ఊరు ఇదే. ఆ అనుభూతులే నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడానికి స్ఫూర్తినిచ్చాయన్నారు.